
పాలమూరులోనూ.. ఆక్రమణలు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు

- ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటలను పూడ్చివేసి మరీ రియల్ ఎస్టేట్ వెంచర్ల ఏర్పాటు
- నాలాలు, వాగులు కబ్జా..
- అవి కుంచించుకుపోవడంతో కాలనీలకు వరద ముప్పు
- పలు చెరువుల అలుగులు, కట్టలు ధ్వంసం.. కొన్ని డీనోటిపై
- రియల్ వ్యాపారులకు గతంలో రాజకీయ అండదండలు.. చర్యలు అంతంతే
- హద్దులు నిర్ణయించి రాళ్లు పాతినా నిర్మాణాలను కట్టడి చేయని అధికారులు
- జిల్లాల్లోనూ హైడ్రా తరహా చర్యలు చేపట్టాలనే డిమాండ్లు


మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ కొత్త చెరువు అలుగును ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న నీరు

మహబూబ్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజధాని హైదరాబాద్ నగరంలో చెరువుల ఆక్రమణ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఏర్పాటు చేసిన హైడ్రా కొరడా ఝళిపిస్తున్న విషయం తెలిసిందే. పెద్ద నాయకులు, సెలబ్రిటీల విషయంలో కూడా హైడ్రా వెనకడుగు వేయడం లేదు. ఈ క్రమంలో హైడ్రా మాదిరిగానే జిల్లాల్లో అలాంటి ఆక్రమణలను అరికట్టడం, ఇప్పటికే ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను తిరిగి ప్రభుత్వపరం చేయడం కోసం సరైన వ్యవస్థ కావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆక్రమణలు ఎక్కువగా ఉండటం ఈ డిమాండ్లకు బలమైన కారణంగా చెప్పవచ్చు. కొన్ని ఆక్రమణల్లో పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉండగా.. మెజారిటీ ఆక్రమణలు మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారులే చేశారనేది 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. వారికి గతంలో రాజకీయ అండదండలు ఉండటంతో అధికారులు హద్దులు గుర్తించినా యథేచ్ఛగా నిర్మాణాలు చేట్టారు. ఇళ్లే కాకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పొచ్చు. ప్రధానంగా పట్టణాలు, పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో చెరువులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరబట్టారు. కాలేజీలు, ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్సులు, కంపెనీల గోదాంలు కూడా నిర్మించిన దాఖలాలు ఉన్నాయి. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో రియల్ వెంచర్ల కోసం మట్టిని పోసి ఎత్తు పెంచారు. దాంతో అనేక కాలనీలు వరద వచ్చిన సమయంలో ముంపునకు గురవుతున్నాయి. నాలాలు కుంచించుకుపోవడంతో భారీగా అలుగులు పారితే నీరు వెళ్లే దారులు కనిపించడం లేదు. చెరువులు, కుంటల్లో వేసిన వెంచర్లు ముంపునకు గురికాకుండా పలుచోట్ల కట్టలు, అలుగులను కూడా ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. కొన్ని కుంటలు కాలగర్భంలో కలిసిపోగా.. కొన్నింటిని ఇరిగేషన్ అధికారులు డీ నోటిఫై కూడా చేస్తున్నారు.

90 నుంచి 60 ఎకరాలకు తగ్గిన మహబూబ్‌నగర్ పెద్ద చెరువు

చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల పర్వం అన్ని జిల్లాల్లో కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు ఒకప్పుడు ఎఫ్‌టీఎల్ పరిధితో కలుపుకుని 90 ఎకరాల విస్తీర్ణం ఉండగా.. ప్రస్తుతం 60 ఎకరాలకు కుచించుకుపోయింది. ఇక్కడ కాలేజీ భవనాలు, కంపెనీల గోదాంలు, బహుళ అంతస్తుల భవనాలు దర్శనమిస్తున్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధి ఇది అని నిర్ధారించిన తర్వాత కూడా ఈ ఆక్రమణలు ఆగలేదు. ఈ చెరువుకుపోయే నాలాలు 20 అడుగుల విస్తీర్ణంలో ఉండాల్సింది. కానీ ప్రస్తుతం ఐదు అడుగులకు కుచించుకుపోయాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు అలుగుల నుంచి నీరు ఎక్కిపారడంతో రాయమ్మబౌలి, శివశక్తినగర్, బీకే రెడ్డి కాలనీ, మధురానగర్, మైత్రినగర్‌లు ముంపునకు గురవుతున్నాయి. పట్టణంలోని ఎర్రమన్ను గుట్ట చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెంచర్ వేయడంతో ఇళ్లను నిర్మించుకున్నారు. కురిహిని శెట్టి కాలనీ ముంపునకు గురవుతోంది. ధర్మాపూర్ కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెంచర్లు వేశారు. భారీ వర్షాలకు చెరువు నిండటంతో ప్లాట్లు మునుగుతున్నాయని రియల్ వ్యాపారులు అలుగును ధ్వంసం చేశారు. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా రాళ్లు వేసినా.. చెరువు ఖాళీ అవుతుండటంతో రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. భూత్పూరు మునిసిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 34లో బోడమోని చెరువు ఉంది. ఈ చెరువులో 16.30 ఎకరాల భూమి ఉండగా, 8.20 ఎకరాల్లో వెంచర్లు వెలిశాయి. సర్వే నెంబర్ 28లో 10.10 ఎకరాల భూమి ఉండగా.. 3.20 ఎకరాల భూమిని కబ్జా చేసి, వెంచర్‌ను ఏర్పాటు చేశారు. సిద్దాయపల్లి శివారులో ఉన్న మైసమ్మ కుంట చెరువులో 2.20 ఎకరాలను ఆక్రమించారు. మట్టి పోసి వెంచర్ వేసేందుకు ప్రయత్నించగా.. గ్రామస్థులు, అధికారులు అడ్డుకున్నారు. ఇదే మండలం తాటిపర్తిలోని మొగుళ్ల కుంటను మొర్రంతో నింపుతూ, కొత్త కుంట తూమును ధ్వంసం చేశారు. గొల్లవానికుంట సగానికిపైగా కుచించుకుపోయింది. గన్నేరుకుంట కట్టను ధ్వంసం చేశారు. జడ్చర్ల మునిసిపాలిటీలో నల్ల కుంట ఏడెకరాలు ఉండగా.. మినీ ట్యాంకుబండ్ పోను మిగిలిన స్థలం పట్టా ఉందంటూ కొందరు ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారు. పోచమ్మగుడి సమీపంలోని ఊరకుంటను ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేశారు. నాలాలు కుచించుకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై పారుతోంది.


నారాయణపేట జిల్లా కేంద్రంలో వాగుపై అక్రమంగా నిర్మించిన రియల్ వెంచర్ కల్వర్టు

నారాయణపేట జిల్లాలో కాలువలు కబ్జా

నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న పల్లవాగు కబ్జాకు గురైంది. దాంతో కొండారెడ్డిపల్లి చెరువు అలుగు పారినప్పుడు ముంపు సమస్య ఎదురవుతోంది. పల్ల బ్రిడ్జి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ ఏర్పాటు చేయడంతో బ్రిడ్జి ఇరుకుగా మారింది. వాగు ఉధృతంగా వస్తే ఆ వెంచర్ పూర్తిగా మునిగిపోతోంది. వెంచర్‌కు వెళ్లడానికి రోడ్డు లేకపోవడంతో వాగుపై కల్వర్టును నిర్మించారు. పల్ల వాగు దిగువన యాద్గిరి రోడ్డులో వెంచర్లు ఏర్పాటు చేసి.. నిర్మాణాలు చేపట్టారు. బారంకుంట కాలువ సైతం కబ్జాకు గురైంది. అలాగే కోస్గి మునిసిపాలిటీ పరిధిలోని నాగుల చెరువు సగం వరకు ఆక్రమణకు గురికాగా.. ఉప్పుసముద్రం తూమును పూర్తిగా మూసివేసి భవన నిర్మాణాలు చేపట్టారు. ఎర్రకుంట చెరువు పదెకరాల ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించారు. కడంపల్లి శివారులోని ఊర చెరువులో గోదాములు వెలిశాయి. రామస్వామి కుంటను పూర్తిగా మూసివేశారు. గుండుమాల్ మండలంలోని కప్పరికుంటలో చెరువును సగం వరకు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.

నాగర్‌కర్నూల్‌లో విలాసవంతమైన భవనాలు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో విలాసవంతమైన భవనాలు వెలిశాయి. పోలీస్‌స్టేషన్‌తో పాటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు నడుస్తున్నాయి. ఇందులో రియల్ మాఫియా నడుపుతున్న బీఆర్ఎస్ నాయకుల హస్తం ఉందని, కేసరి సముద్రంలో 31 చోట్ల ఆక్రమణలు అయ్యాయని రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. కేసరి సముద్రం చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఇప్పటివరకు అమలు కాలేదు. మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండలో కూడా రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం తుమ్మలకుంట కట్టను తెగ్గొట్టారు. అచ్చంపేట నడిబొడ్డున ఉన్న మల్లంకుంటను ఆక్రమించి, అనేక నిర్మాణాలు చేపట్టారు. జిల్లా పరిధిలోని ప్రధాన మునిసిపాలిటీల్లో చెరువులు, కుంటలు, నాలాల కబ్జాల పర్వం కొనసాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫిర్యాదులు చేస్తున్నా, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినా చర్యలకు ఉపక్రమించడం లేదు.

గద్వాలలో ఫంక్షన్ హాళ్లు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రాన్ని ఆనుకుని జములమ్మ రిజర్వాయర్ ఉంది. ఇక్కడ సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో రెండు ఫంక్షన్ హాళ్లను నిర్మించారు. అదే విధంగా సంగాల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో మట్టి పోసి, ఎత్తు పెంచి వెంచర్లు వేశారు. గద్వాల సమీపంలోని చెనుగోనిపల్లి చెరువు బఫర్ జోన్‌లో కూడా ఇళ్లను నిర్మించారు. కొత్త హౌసింగ్ బోర్డు దగ్గర సిద్ధాంతవారి కుంటను కూడా కబ్జా చేసి ప్లాట్లు చేశారు. కుంట వీధిగా చెప్పుకునే కుంట ఎప్పుడో కనుమరుగైంది. వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఇదే జిల్లా అయిజ పట్టణాన్ని ఆనుకుని ఉన్న వాగును ఆక్రమిస్తూ కట్టడాలు వెలుస్తున్నాయి. బడాబాబులే ఈ వాగును చెరబడుతున్నారు. బస్టాండ్ మొదలుకుని కొత్త బస్టాండ్, తెలంగాణ చౌరస్తా, కర్నూలు రహదారి వరకు వాగులు, వంకలు, నాలాలను ఆక్రమిస్తూ కట్టడాలు చేపడుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.


గద్వాల జిల్లా అయిజ వాగును ఆక్రమించి చేసిన నిర్మాణాలు

వనపర్తిలో ముంపునకు గురవుతున్న ప్లాట్లు


వనపర్తిలో కుంచించుకుపోయిన తాళ్ల చెరువు అలుగు కాలువ

వనపర్తి పట్టణంలో మినీ ట్యాంకుబండ్‌గా మార్చిన నల్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అనేక వెంచర్లు వేసి, ప్లాట్లు చేశారు. వాయిదా పద్ధతిలో ఏళ్ల క్రితమే ప్లాట్లు వేసి విక్రయించారు. ఈ చెరువును కేఎల్ఐకి లింక్ చేయడంతో అనేకమంది ప్లాట్లు ముంపునకు గురయ్యాయి. తక్కువ ధరకు ప్లాట్లు కొనుగోలు చేసిన పేదలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అలాగే పెట్రోల్ బంక్ వెనకాల రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేయగా, గతంలో శ్వేతామహంతి కలెక్టర్‌గా ఉన్నప్పుడు దాన్ని నిలిపేశారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడ నిర్మాణాలు వెలిశాయి. తాళ్ల చెరువు పరిధిలో కూడా వెంచర్లు వేయడంతో కొనుగోలు చేసిన వారు ఇళ్లను నిర్మించుకున్నారు. తాళ్ల చెరువు నుంచి వచ్చే నాలాలపై ఆక్రమణలు చేయడంతో శ్వేతానగర్ అలుగుపారితే ముంపునకు గురవుతోంది. మర్రికుంటలో సర్వే నెంబర్ 172, 173, 174, 175, 177, 178, 183లో గతంలో వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించారు. కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టారు. చెరువు పునరుద్ధరణలో నిర్మాణాలను తొలగించగా.. లబోదిబోమంటున్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అలంపూర్ సీఐ రవిబాబు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

- గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు శివారులో ఘటన

అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 27: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ఇటిక్యాలపాడు శివారులో, 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిపై ఘర్ దాబా సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఏఎస్ఐ సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు నుంచి హైదరాబాదు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతడు మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వయసు 45 ఏళ్లలోపు ఉండొచ్చని, మెడకు ఎరుపురంగు దారం, బూడిదరంగు టీ షర్ట్, గళ్ల అడ్డపంచ ధరించి ఉన్నాడని ఏఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే ఉండవల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంఘటన స్థలాన్ని అలంపూర్ సీఐ రవిబాబు, ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ పరిశీలించారు.

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య

- కుటుంబీకులు మందలించారని మనస్తాపం
- కోడేరు మండలం రాజాపూర్‌లో ఘటన


దేవమ్మ(ఫైల్)

పెద్ద కొత్త పల్లి (కోడేరు), ఆగస్టు 27 : కుటుంబీకులు మందలించారని ఓ వృద్ధురాలు మనస్తాపానికి గురై చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ ఖయ్యూమ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేకులపల్లి దేవమ్మ(70) రోజూ కల్లు తాగి, తిరుగుతుండేది. దేవమ్మను కుటుంబీకులు కల్లు తాగొద్దని మందలించడంతో మనస్తాపానికి గురైంది. గ్రామ సమీపంలోని ఊర చెరువులో పడి, ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని శవపరీక్ష నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. దేమ్మకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కల్యాణం కమనీయం

- అంగరంగ వైభవంగా జములమ్మ వివాహం
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు, పుర ప్రముఖులు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్‌పర్సన్


జమ్ములమ అమ్మవారు

గద్వాల, ఆగస్టు 27: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో పురేందర్ కుమార్, చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో 12:15 నిమిషాలకు జమదగ్ని మహరితో జములమ్మకు మాంగళ్యధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు తెచ్చారు. ఎమ్మెల్యే దంపతులకు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితకు ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం వారు కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జములమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రోడ్డు వెడల్పు చేసి.. సీసీ రోడ్డు నిర్మించామన్నారు. సెంట్రల్ లైటింగ్‌తో పాటు అష్టాదశ విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భక్తుల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు చేయనున్నట్లు తెలిపారు. అమ్మవారి దీవెనలు ప్రజలపై ఉండాలని, గద్వాల అభివృద్ధి శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు చెప్పారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ జములమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అధికారులను అభినందించారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందని, భక్తులకు మెరుగైన సేవలకు తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.


తాళిని చూపుతున్న పురోహితుడు


కల్యాణానికి హాజరైన భక్తులు

వేలాదిగా హాజరైన భక్తులు

కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలొచ్చారు. కల్యాణాన్ని దగ్గరగా చూసేందుకు పెద్ద డిజిటల్ తెరలను ఏర్పాటు చేశారు. వివాహం అనంతరం ఒక్కక్కరు అక్షింతలు వేసి, ఆశీస్సులను తీసుకున్నారు. తర్వాత అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి కల్యాణానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరు అవుతున్నట్లు తెలుసుకున్న పోలీసు అధికారులు ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ రక్తం.. ప్రైవేటుకు

- జోగుళాంబ గద్వాల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తరలింపు
- గవర్నమెంట్ దవాఖానాలో నిల్వలు లేక రోగుల ఇక్కట్లు
- ఆస్పత్రిలో కొందరు సిబ్బంది ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న జిల్లా అధికారులు

గద్వాల క్రైం, ఆగస్టు 27: జోగుళాంబ గద్వాల జిల్లాలో రక్త సేకరణ కేంద్రాలు నిర్వహిస్తున్నా.. రక్తం నిల్వలు మాత్రం కొరవడుతున్నాయి. పేదలకు ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో అందాల్సిన రక్తం.. అక్కడి నుంచి కొందరు వ్యక్తుల ప్రమేయంతో ప్రైవేట్ ఆస్పత్రుల రోగులకు చేరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 27 బ్లడ్ క్యాంపులను ఏర్పాటు చేశారు. 1,002 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, అందులో 964 యూనిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు 615 యూనిట్లు, ప్రైవేట్ ఆస్పత్రి రోగులకు 145 యూనిట్లు ఉచితంగా ఇచ్చినట్లు ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మిగతా 204 యూనిట్లు కూడా ప్రైవేట్ ఆస్పత్రుల రోగులకు ఇచ్చినట్లు సమాచారం. అంటే 349 యూనిట్ల రక్తం ప్రైవేట్ ఆస్పత్రులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. కొందరు సిబ్బంది తమకు కావాల్సిన ప్రైవేట్ ఆస్పత్రులకు రక్తం పంపిస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల వారికి ఎలాంటి ప్రయోజనం ఉందో తెలియాల్సి ఉంది. ప్రైవేటు ఆస్పత్రులకు రక్తం ఇవ్వాలంటే ప్రతిగా ఒకరు రక్తం దానం చేయడంతో పాటు రూ.1050 నగదు ఇవ్వాల్సి ఉంది. అది కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇబ్బంది ఉండదు అనుకుంటేనే ఇవ్వాలి. కానీ రక్తం తీసుకోకుండా, రూ.1,050 తీసుకొని ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రైవేట్ ఆస్పత్రులకు రక్తం ఇవ్వొచ్చన్న మార్గదర్శకాలు లేవని తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు చెందాల్సిన రక్తం ఇలా ప్రైవేట్ ఆస్పత్రులకు ఇస్తుంటే అత్యవసర పరిస్థితిలో గవర్నమెంట్ దవాఖానాలోని రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ఇతర ప్రాంతాల నుంచి కానీ, దాతల నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు

నిఘా ఉంచాలి

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తం నిల్వలు ఇతర ప్రాంతాలకు తరలించే విషయంపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా ఆస్పత్రి కావడంతో ఇక్కడ శస్త్రచికిత్సలు, డెలివరీలు, ప్రమాదాలు కేసులు ఎక్కువగా వస్తుంటాయి. అందుకోసం రక్తం ఎక్కువగా అవసరం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు కావాల్సిన రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

ప్రభుత్వ ఆస్పత్రి రోగులకే మొదటి ప్రాధాన్యం

జిల్లా ఆస్పత్రి రోగులకు రక్తం ఇవ్వడంలో మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ఎక్కువ మొత్తంలో రక్తం పోకుండా చర్యలు తీసుకుంటాం. నిల్వలు పక్కదారి పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వచ్చిన వారికి ఒక యూనిట్ రక్తం ఇస్తే.. ఒకరు రక్తం ఇవ్వడంతో పాటు రూ.1,050 నగదు ఇవ్వాల్సి ఉంటుంది.

- డాక్టర్ వినోద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

జడ్చర్లలో సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు హామీ : ఎమ్మెల్యే

జడ్చర్ల, ఆగస్టు 27 : నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు జడ్చర్లలో సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెట్విన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇప్పటి వరకు కొన్ని కేంద్రాల్లోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, శిక్షణ కేంద్రాలను మరిన్ని విస్తరిం చాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు జడ్చర్లలో ఏర్పాటు చేయనున్నారని పేర్కొన్నా రు. రాష్ట్రంలో జడ్చర్లతో పాటు జహీరాబాద్, వికారాబాద్, తాండూరు, సంగారెడ్డిలలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సెట్విన్ ఛైర్మన్ వెల్లడించారని తెలిపారు. కంప్యూటర్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎయిర్‌లైన్ టికెటింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ప్రింటింగ్‌ప్రెస్, కట్టింగ్ అండ్ టైలరింగ్ తదితర విభాగాలలో సెట్విన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్చర్లలో ఏర్పాటు చేసే కేంద్రంలో మరిన్ని కోర్సులు తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శాంతినగర్ విద్యార్థులు

వడ్డేపల్లి, ఆగస్టు 27 : వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని శాంతినగర్ సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో చిత్రలేఖనం విభాగంలో రెండవ స్థానంలో నిలిచిన గంగానిషిత, వ్యాసరచనలో రెండవ స్థానంలో నిలిచిన నందిని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. త్రిదండి రామానుజ చినజీయర్ స్వామీజీ మంగళశాసనం, ప్రజ్ఞావికాస్, ట్రస్మా ఆధ్వ ర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చేనెల రెండవ తేదీన ముచ్చింతల్‌లోని జీయర్ స్వామి ఆశ్రమంలో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు గంగా నిషిత, నందిని పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సులో చేరేందుకు అవకాశం

జడ్చర్ల, ఆగస్టు 27 : జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సులో చేరేందుకు అడ్మిషన్ పొందవచ్చని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజుల మంగళవారం ఓ ప్రకట నలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కళాశాలకు రావచ్చని పేర్కొన్నారు.

ఏఐసీసీ అబ్జర్వర్‌ను కలిసిన జిల్లా నాయకులు


ఏఐసీసీ అబ్జర్వర్ రోహిత్ చౌదరితో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

ధరూరు, ఆగస్టు 27 : కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మంగళవారం ఏఐసీసీ అబ్జర్వర్ రోహిత్ చౌదరిని కలిశారు. జిల్లా నాయకులు మధుసూదన్‌బాబు, డీఆర్ శ్రీధర్, అమరవాయి కృష్ణారెడ్డి, లత్తిపురం వెంకటరామిరెడ్డి, మోహన్‌రావు, అచ్చన్న గౌడ్‌లు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయనను కలిసి మాట్లాడారు. గద్వాల నియోజకవర్గం అభివృద్ధి, జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

కేజీబీవీ వర్కర్లకు జీతాలు పెంచాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

కోయిలకొండ, ఆగస్టు 27 : కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించే వర్కర్లకు జీతాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో మాదిరిగా కేజీబీవీలో పని చేసే వర్కర్లకు సమానంగా జీతాలు పెంచాలని కోరారు. కేజీబీవీ వర్కర్స్‌తో పాటు నాన్ టిచింగ్ సిబ్బందికి జీతాలు పెంచి పర్మినెంట్ చేయాలని కోరారు. వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 30న ఎస్‌పీడీ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవి కార్మికులు ఈశ్వరమ్మ, కళావతి, పద్మమ్మ, లక్ష్మీ, నవనీత, రాణి, ప్రమీల, మంగమ్మ, సింధు తదితరులు పాల్గొన్నారు.

పల్లె గుండెల్లో పేలుళ్లు

- హడలెత్తిస్తున్న అనుమతి లేని బ్లాస్టింగులు - భయం గుప్పిట్లో మూడు గ్రామాలు



గట్టు మండలంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్న సల్కాపురం గట్టు

గట్టు, ఆగస్టు 27 : అనుమతిలేని బ్లాస్టింగులు మూడు గ్రామాల ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ముందస్తు సమాచారం లేకుండా పెద్ద బండరాళ్లను పేల్చుతుండటంతో చుట్టు పక్కల పొలాల్లో రైతులు బిక్కుబిక్కుమం టూ పనులు చేసుకుంటున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని సల్కాపురం, రాయపురం, జోగన్‌గట్టు గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏ బండ ఎగిరి నెత్తిన పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. భారత్‌మాల రహదారి నిర్మాణానికి కంకర కోసం సల్కాపురం దగ్గరున్న గుట్టల్లో అనుమతి లేకుండా క్వారీ ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్లు నిబంధనలను ఉల్లంఘించి గుట్టలోని బండలను యథేచ్ఛగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. అయినా స్థానిక అధికారులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆ మూడు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుట్ట నుంచి లక్షల క్యూబిక్ మీటర్ల కంకర అక్రమంగా తరలిపోతోంది.

ముందు జాగ్రత్తలు లేకుండా..

సల్కాపురం సమీపంలోని ఉన్న గుట్టపై బ్లాస్టింగ్ చేసేటప్పుడు ముందు జాగ్రత్తలు పాటించడం లేదు. ఎప్పుడు పడితే అప్పుడు పేలుళ్లు జరుపుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు కంటిమీద కునుకు లేకుండా కాలం గడుపుతున్నారు. బ్లాస్టింగులతో పొలాల్లో రాళ్లు పడటంతో పాటు, గ్రామాల్లో ఇళ్లకు నెర్రెలు వారుతున్నాయి. పొలాల్లోని బోర్లు, బావులు కూడా పూడుకుపోతున్నాయని రైతులు చెప్తున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ చేయాలంటే ముందుగా పోలీస్‌శాఖ, మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే పరిసర గ్రామాల ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. కానీ గత సంవత్సరం నుంచి ఇక్కడ ఇష్టానుసారంగా బ్లాస్టింగ్‌లు జరుపుతున్నారు. గుట్టతో పాటు మట్టి తవ్వకాలకు కూడా ఎక్కడ పడితే అక్కడ బ్లాస్టింగులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాయపురం శివారులో మార్కెటింగ్ గోదాంకు దగ్గరలోని ప్రభుత్వ భూమిలో కూడా బ్లాస్టింగ్‌లు చేసినట్లు రైతులు తెలిపారు.

కార్మికుడి మృతితో..

క్రషర్ నిర్వాహకులు ఆదివారం జరిపిన బ్లాసింగ్ ధాటికి బండలు ఎగిరిపడి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎక్స్‌కవేటర్ అపరేటర్ విజయ కుమార్ సింగ్ గొండు మృతి చెందాడు. దీంతో బ్లాస్టింగుల విషయం చర్చనీయాంశమైంది. దీంతో స్థానిక అధికారులు క్రషర్ నిర్వాహకులను మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి ఆరా తీశారు.

క్వారీకి అనుమతులు లేవు

సరితారాణి, తహసీల్దార్ : రాయపురం దగ్గరున్న సల్కాపురం గుట్టల్లో క్వారీకి అనుమతులు లేవు. బ్లాస్టింగ్‌లకు కూడా అనుమతులు తీసుకోలేదు. క్రషర్ నిర్వాహకులను పిలిచి వారి దగ్గర ఉన్న పత్రాలు ఇవ్వాలని అడిగాం. ధ్రువపత్రాలు ఇవ్వకపోతే క్రషర్‌ను సీజ్ చేస్తాం.

బ్యాంకు వద్ద బారులు తీరిన రైతులు



అమరచింత యూనియన్ బ్యాంకు బ్రాంచి ముందు భారీగా చేరిన ఖాతారులను అదుపు చేస్తున్న ఎస్‌ఐ సురేష్

- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

అమరచింత, ఆగస్టు 27: మూడు రోజుల వరుస సెలవుల తరువాత మంగళవారం తెరుచుకున్న యూనియన్ బ్యాంకుకు ఖాతాదారులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రైతులు ఖాతాదారులు బ్యాంకు ముందు రహదారి పొడవునా బారులు తీరారు. దీంతో ఒకరినొకరు తోపులాడుకునే పరిస్థితి ఏర్పడడంతో ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి బ్యాంకు వద్దకు చేరి బందోబస్తు ఏర్పాటు చేశారు. రూ.2లక్షల రుణమాఫీ అయిన రైతులు కొత్త రుణాలు తీసుకునేందుకు, కొందరు రూ.2 లక్షల రుణమాఫీ అయ్యిందా లేదా తెలుసుకునేందుకు రావడంతో బ్యాంకు జనం కిక్కిరిసిపోయింది. సాయంత్రం నాలుగు గంటల వరకు బ్యాంకు ముందు రద్దీ కనిపించింది.



అమరచింత యూనియన్ బ్యాంకుకు భారీగా తరలివచ్చిన రైతులు

రెగ్యులర్ డిగ్రీలతో సమానం

- ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు
- జడ్చర్లలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం పరిశీలన

జడ్చర్ల, ఆగస్టు 27 : రెగ్యులర్ డిగ్రీలతో సమానంగా అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అని ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని మంగళవారం ప్రొఫెసర్ పల్లవి, దయాకర్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, యువతీ, యువకులు ఉన్నత విద్యనభ్యసించేందుకు వారి చెంతకే దూర విద్య ద్వారా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విషయ పరిజ్ఞానం అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పనలో, శిక్షణా నైపుణ్య సాధనలో దూరవిద్య అధ్యయన కేంద్రం వెనుకంజ వేయలేదని వివరించారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ పద్ధతి ద్వారా విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునే పద్ధతి ఉందని పేర్కొన్నారు. అలాగే జూమ్, యూట్యూబ్‌ల ద్వారా విద్యను బోధిస్తున్నట్లు వివరించారు. సాంఘికశాస్త్రాలు, సైన్స్ విభాగాలు, సైకాలజీ, కామర్స్ విభాగాలున్నాయని తెలిపారు. పుస్తకాలు ఇంటికే పంపుతూ విద్యను పంచుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 103 డిగ్రీ కళాశాలల్లో ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం కళాశాలలోని బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య, జూనియర్ అసిస్టెంట్ నర్సిములు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జడ రిబ్బన్‌తో తరగతిని గుర్తించేలా..



వైట్ కలర్ జడ రిబ్బర్లతో ఆడుకుంటున్న ఏడో తరగతి విద్యార్థులు

వనపర్తి రూరల్, ఆగస్టు 27: వనపర్తి పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిని తరగతిని గుర్తించేలా జడలకు రంగు రంగుల రిబ్బన్‌లను ఎంపిక చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 892 మంది విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థిని తరగతి గది నుంచి బయటికి రాకుండా ఒకవేళ వస్తే ఏ తరగతి అని గుర్తించేలా విద్యార్థిని జడలకు క్లాసును బట్టి కలర్ రిబ్బన్ పెట్టుకునే విధంగా నిబంధన పెట్టారు. ఆరో తరగతి విద్యార్థినులు ఆరెంజ్ కలర్, ఏడో తరగతి వైట్, ఎనిమిదో తరగతి విద్యార్థినులు గ్రీన్ కలర్, తొమ్మిదో తరగతి వారు మెరూన్ కలర్, పదో తరగతి వారు బ్లాక్ కలర్ రిబ్బన్లతో ఉండాలని ఉపాధ్యాయులు నిబంధన పెట్టారు. ఎవరైనా విద్యార్థిని తరగతి గది నుంచి బయటికి వస్తే రిబ్బన్ కలర్ చూసి ఆ తరగతిలోకి పంపించేందుకు సులువగా ఉంటుందని ఈ నిబంధన అమలు చేస్తున్నట్లు హెచ్‌ఎం ఉమాదేవి తెలిపారు. ఆమె నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రీన్ కలర్ రిబ్బన్లతో ఎనిమిదో తరగతి విద్యార్థినులు

పట్టపగలే ఇంట్లో చోరీ

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శ్రీసాయివాసవినగర్ కాలనీలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీసాయివాసవినగర్ కాలనీలో నివాసం ఉండే కోటయ్య మంగళవారం కూలీ పనికి వెళ్లగా.. భార్య కోటమ్మ, ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు ఇంట్లోకి చొరబడి వంటగదిలో గిన్నెల కింద దాచి ఉంచిన రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన వారికి ఇల్లు తెరిచి ఉండడంతో గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

పాముకాటుతో రైతు మృతి



చిన్నయ్య(ఫైల్)

వంగూరు, ఆగస్టు 27 : పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం మిట్టసదగోడు గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మేకల చిన్నయ్య(32) మంగళవారం పొలంలో పత్తి చేనుకు గుంటుక కొడుతుండగా ఎడమ కాలుపై పాము కాటు వేసింది. గమనించిన చిన్నయ్య విషయాన్ని పక్కన ఉన్న రైతులకు చెప్పడంతో వారు వెంటనే చికిత్స నిమిత్తం కారులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ్నుంచి వెల్దండలోని యెన్నం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

- మాజీ ఐఏఎస్ ఆధికారి ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న అకునూరి మురళీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 27 : ప్రభుత్వం విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వీవీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ విద్యారంగంపై నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. దీంతో విద్యారంగం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. విద్యా రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో విద్యకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం కన్వీనర్ కత్తి వెంకటస్వామి, అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు విద్యారంగం సమస్యలపై మాట్లాడారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీజేఎంఏ ప్రెసిడెంట్ సతీష్, టీపీఆర్‌టీయూ వ్యవస్థాపకులు పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, సదానందం, డాక్టర్ నిరంజన్, అరుణ్ కుమార్, అశోక్, దేవేంద్రచారి, కురుమూర్తి, ప్రవీణ్‌కుమార్, వేణు, బెక్కరి యమున పాల్గొన్నారు.

రైతులకు బ్యాంకు ఫలాలు అందేలా కృషి

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 27 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి అన్ని విధాలుగా డీసీసీబీ బ్యాంక్ ఫలాలు అందేలా కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డీసీసీబీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం ఆధ్వర్యంలో విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మెజార్టీ పీఏసీఎస్‌లు బ్యాంక్ నిర్లక్ష్యానికి గురై తీవ్ర అసమానతలకు కారణమైందన్నారు. ప్రస్తుతం అటువంటి పొరపాట్లు జరగకుండా తమ పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని సంఘాలను సమానస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకార రంగం అభివృద్ధికి కేంద్ర సహకార శాఖ అర్థిక విభాగం రూ. 5వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసిందని తెలిపారు. 500 కోట్ల రూపాయలు మన డీసీసీబీకి సమకూరుతాయని, ఈ నిధులతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 78 పీఏసీఎస్‌లు వివిధ రకాల కార్యకలాపాలకు వినియోగించి అవన్నీ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతీ సమస్యను గుర్తించి రాష్ట్ర మంత్రి దృష్టికి తీసువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ బోర్డు డైరెక్టర్లు రంగారెడ్డి, సుభాన్, ఈదప్ప, నాబార్డ్ డైరెక్టర్ వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ ఫోరం ప్రధాన కార్యదర్శి పాలెం సుదర్శన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రఘు, వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.



డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- దీర్ఘకాలిక, మిస్సింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ రావుల గిరిధర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూరు, ఆగస్టు 27: కొత్త చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను, కేసుల వివరాలను ఎస్‌ఐ నరేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆయా కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా సమగ్ర విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే దీర్ఘకాలిక, మిస్సింగ్ కేసులు, ఫోక్సో కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యుఐ కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలని ఎప్పటికప్పుడు రోజువారి పురోగతి సీసీ టీఎన్‌ఎస్ నందు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా గ్రామ పెద్దలను దాతలను కలిసి ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పని చేసే సిబ్బంది అందరూ కూడా వర్టికల్ వారిగా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేందర్, అమరచింత, ఎస్‌ఐ సురేష్ తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై విచారణ



అమరచింతలో విచారణ చేస్తున్న డీఎస్పీ

అమరచింత,ఆగస్టు27: మండలంలో వేరువేరుగా నమోదైన అట్రాసిటీ కేసులపై మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గత శనివారం అమరచింత ఎస్సీ కాలనీ జరిగిన గొడవలో మహమూద్, శ్రీకాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు అయింది. మండల పరిధిలోని నాగల్‌కడుమూర్ గ్రామంలో ప్రహరీ విషయంలో ఘర్షణ జరిగి అంజనేయులు, ఎల్లమ్మ, శారద, శివ తదితరులపై అట్రాసిటీ కేసు నమోదు అయింది. ఈ రెండు వేర్వేరు సంఘటనలపై డీఎస్పీ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టారు. అమరచింత, నాగల్‌కడుమూర్ గ్రామాల్లో వేర్వేరుగా బాధితుల వివరణ, పిటీషన్ ఇచ్చిన వారి వివరణ, చుట్టుపక్కల వారితో మాట్లాడి క్షుణ్ణంగా విచారణ చేశారు. యువకులు ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరు వెళ్లిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

200 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, ఆగస్టు 27: ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 200 మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తి జరిగినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 11 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తి కొనసాగినట్లు తెలిపారు. గడిచిన 24 గంటల్లో ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 3.787 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరగగా.. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 115.080 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగినట్లు తెలిపారు. దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా గడిచిన 24 గంటల్లో 4.392 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరగగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 93.517 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగిందని ఆయన తెలిపారు. వరద ఇదే మాదిరిగా కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

కళకళలాడుతున్న చెరువు, కుంటలు

- చేప పిల్లలు వదులుతున్న మత్స్యకారులు



చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

గోపాల్‌పేట, ఆగస్టు 27 మండలంలోని చెరువు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు, మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు సాగు పనుల్లో బిజీగా ఉండగా మత్స్యకారులు చేపల పెంపకానికి సిద్ధమవుతున్నారు. మంగళవారం మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బెల్లెదుల్ల బాలరాజు మత్స్యకారులుతో కలిసి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు, అమ్మచెరువు, కత్వా, రెడ్లకుంటలలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండాయని, ప్రస్తుతం ప్రభుత్వం చేప పిల్లలను ఇవ్వనందున మా సొంత డబ్బుతో చేప పిల్లలను కొనుగోలు చేసి వదిలామని తెలిపారు. కార్యక్రమంలో బాలయ్య, వెంకటయ్య, చంద్రయ్య, రాములు, ఎల్లస్వామి, లక్ష్మీనారాయణ, బక్కన్న, రమేష్, చంద్రయ్య, బాలరాజు, షైబుస్, గోపి, శివుడు, తదితరులు పాల్గొన్నారు.

పెర్కివీడ్ వాసికి ఓయూ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేష్

కోయిలకొండ, ఆగస్టు 27 : మండలంలోని పెర్కివిడ్ గ్రామవాసి ఎం. వెంకటేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అందించారు. యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసి పీహెచ్‌డీ అడ్మిన్ పొందారు. సీనియర్ ప్రొఫెసర్ అప్పారావు పర్యవేక్షణలో పాలమూరు జిల్లాలో పంటల బీమా పథకాల పట్ల రైతులకు అవగాహన, ఎంపిక చేసిన 'పబ్లిక్, ప్రైవేట్ కంపెనీలపై తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. అఖిల భారత అకౌంటింగ్ నిర్వహణ సంస్థకు పాలకమండలి సభ్యుడిగా ఉన్న వెంకటేష్ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకరావాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అభినందించారు. రైతు బిడ్డ అయిన వెంకటేష్ ఓయూ గౌరవ డాక్టరేట్ పొందడంపై గ్రామ మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

కర్నూలులో 'ఆరోగ్యశ్రీ' వర్తింపజేయాలి

▸ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వినతి


ఏపీ సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న గజేంద్రగౌడ్

వడ్డేపల్లి, ఆగస్టు 27 : నడిగడ్డ ప్రాంతవాసులకు కర్నూలులోని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గజేంద్ర గౌడ్ కోరారు. హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ గద్వాల, అలంపూర్, నడిగడ్డ ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య సదుపాయాలు కర్నూలు జిల్లాలోని ఆసుపత్రుల్లో ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఏపీలోని కర్నూలు జిల్లాకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సకాలంలో వైద్య సేవలందించాలి

▸ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 27 : ప్రజలకు సకాలంలో అన్ని రకాల వైద్యసేవలందేలా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉన్నదని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లలో పని చేసే సిబ్బందితో జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య, ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఓరియంటేషన్, కాంప్రహెన్సివ్ ప్రైమరీ హెల్త్‌కేర్, దిశ కార్యక్రమాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ తదితర అంశాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సంధ్యా కిరణ్మయి, డీపీఎం మాధవి, డీడీఎం రామాంజనేయులు, కల్యాణి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, బీఏఎంఎస్ వైద్యులు, ఎయిడ్స్ దిశ ప్రోగ్రాం సిబ్బంది రాఘవేంద్రరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

అనుమతిలేని హాస్టళ్లను మూసి వేయించాలి

▸ ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ శివకుమార్


కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గద్వాల టౌన్, ఆగస్టు 27 : జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లను మూసివేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ శివకుమార్ కోరారు. ఫెడరేషన్ తరఫున మంగళవారం వారు డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, మహేష్ వసంత్, రాజేష్, రాము, శివ ఉన్నారు.

వలస కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

▸ పీడీఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్ డిమాండ్


క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

గట్టు, ఆగస్టు 27 : బ్లాస్టింగ్ రాళ్లు మీదపడి మృతి చెందిన మధ్య ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు విజయ్‌కుమార్‌సింగ్ గొండు కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సుభాన్ డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన సల్కాపురం గట్టును మంగళవారం పరిశీలించారు. అనంతరం కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. వలస కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ఏవీపీ కాంట్రాక్టర్ పూర్ణచంద్రరావ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి

మల్దకల్, ఆగస్టు 27 : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేలా పాఠ్యాంశాలు బోధించాలని మండల నోడల్ అధికారి నరేశ్ అన్నారు. మండలంలోని నీలిపల్లి, చర్లగార్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన ఫలితాల స్థాయిలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో చదివే నైపుణ్యాన్ని పెంచేందుకు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులందరూ ప్రార్థన సమయానికి హాజరు కావాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదేవి, మురళీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తిమ్మప్ప, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ శ్రీహరికి సన్మానం


మాస్టర్ శ్రీహరిని సన్మానిస్తున్న టెక్నికల్ చైర్మన్, ప్రతినిధులు

గద్వాల అర్బన్/ అయిజ, ఆగస్టు 27 : పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ కే. శ్రీహరిని ఘనంగా సన్మానించారు. ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి బ్లాక్‌బెల్ట్ ఎగ్జామ్ కోర్సులో ఆయన పట్టాను, అవార్డును అందుకున్నారు. ఆయనతో పాటు అయిజకు చెందిన సుధీర్‌కుమార్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గద్వాల పట్టణంలోని కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా టెక్నికల్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి, ప్రతినిధులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రంగస్వామి, రాజేశ్వరి, సుధీర్‌కుమార్, శాంతి, హరిసాయి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ

▸ ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


ట్రై సైకిళ్లను అందుకున్న దివ్యాంగులతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 27 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు టెంకాయల చంటి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అలింకో సంస్థ ద్వారా గద్వాల నియోజకవర్గానికి చెందిన 20 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందించారు. సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబ సభ్యురాలికి సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల, ఆగస్టు 27 : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత అందించారు. మెరుగైన వైద్యం కోసం చందునాయక్‌కు రూ.22,500, బేబీకి రూ.42 వేలు, సునీతకు రూ. 15 వేలు, మసీన తాస్కిన్‌కు రూ.11 వేలు, ఉదయ్‌కుమార్‌రెడ్డికి రూ. 60 వేలు, కృష్ణారెడ్డికి రూ.9,500 సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం గద్వాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇసాక్, జమ్మిచేడు ఆనంద్, తిమ్మోతి, సురేశ్, శ్రీనివాస్ గౌడ్, నరహరి గౌడ్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రకృతి వనం పరిశుభ్రం

▸ పిచ్చిమొక్కలను తొలగించిన మునిసిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 27 : జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలోని పట్టణ ప్రకృతి వనం దుస్థితిపై 'ఆహ్లాదం కరువు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. మునిసి పల్ కౌన్సిలర్ రామకృష్ణశెట్టి మంగళవారం పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించారు. మునిసిపల్ సిబ్బందితో శుభ్రం చేయించే పనులు చేపట్టారు. గత కొన్ని నెలలుగా మునిసిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పార్కులో ముళ్లపొదలు, పిచ్చిచెట్లు, మొక్కలు విపరీతంగా పెరిగాయి. దీంతో సమీపంలోని ఇళ్లలోకి పాములు వస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. దోమల బెడత తీవ్రం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. మరో రెండు రోజుల్లో ప్రకృతి వనం మొత్తం శుభ్రం అవుతుందని కౌన్సిలర్ తెలిపారు.


ప్రకృతివనంలో పిచ్చిమొక్కలు, కంపచెట్లను శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ రామకృష్ణ

చివరకు ధర్మమే గెలిచింది

▸ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు



గద్వాల పట్టణంలో నిర్వహించిన సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల టౌన్/ గట్టు, ఆగస్టు 27 : న్యాయ పోరాటంలో చివరికి ధర్మమే గెలిచిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం గద్వాల పట్టణంతో పాటు గట్టులో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. గద్వాల పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో ఆయకులు బాణసంచా పేల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతునాయుడు మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులు ఎన్నిరకాలుగా వేధించినా, కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి తట్టుకుని నిలబడే శక్తి ఉందన్నారు. బీఆర్ఎస్‌పై సాగుతున్న రాజకీయ దాడులు, వేధింపులను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మోనేష్, శేఖర్‌నాయుడు, తిమ్మప్పగౌడ్, తిరుమలేష్, మునెప్ప, అబ్బు, బీచుపల్లి, భాస్కర్, శివ, అన్సార్, మెహబూబ్, సూరి, నరసింహులు, కామేష్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నాయకురాలు, ఎంఎల్‌సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం ప్రకటించారు. గట్టు బస్టాండ్ ఆవరణలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ఎస్.రాము, రాజునాయుడు, బాసుగోపాల్, దార్నాల వీరేష్, కద్రెప్ప, శాంతప్ప, బ్రహ్మ సూరి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్టు ఫండ్ బకాయిలు చెల్లించాలి

▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ▸ రాజోలి తహసీల్దార్ కార్యాలయం ముందు చేనేత కార్మికుల ధర్నా

రాజోలి, ఆగస్టు 27 : త్రిఫ్ట ఫండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. రాజోలి తహసీల్దార్ కార్యాలయం ముందు చేనేత కార్మికులు మంగళవారం చేపట్టిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నేతన్నకు చేయూత (త్రిఫ్ట ఫండ్) పథకానికి కార్మికులు క్రమం తప్పకుండా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం అందించాల్సిన నగదును 10 నెలలుగా జమ చేయడం లేదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేసి చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సిల్క్ సబ్సిడీ, నేతన్నకు బీమా, ఆరోగ్య బీమా తదితర పతకాలను నిలిపివేసిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్డీ-2 బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మం డల అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు రాజేష్, అంజి, తిరుమలేష్, వెంకటేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

కార్మికవర్గ ప్రయోజనాలే లక్ష్యం

▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కిల్లె గోపాల్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కిల్లె గోపాల్

గద్వాల టౌన్, ఆగస్టు 27 : సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల ప్రయోజనాలు, వారి సంక్షేమమే లక్ష్యంగా సీఐటీయూ నిరంతరం పోరాటం సాగిస్తోందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కిల్లె గోపాల్ అన్నారు. 'సీఐటీయూ విశిష్టత' అనే అంశంపై పట్టణంలోని వాల్మీకి కమిటీ హాల్‌లో ఆశ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఐక్యత, పోరాటం అనే నినాదాలతో 1970లో ఆవిర్భవించిన సీఐటీయూ దేశంలోని అన్నివర్గాల కార్మికులకు ఏకం చేస్తూ అనేక అను బంధ సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులను చైతన్యవంతం, సంఘటితం చేయడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక జీవితాల్లో మార్పు కోసం అవిశ్రాంత పోరాటం సాగిస్తోం దన్నారు. శ్రమదోపిడీని అడ్డుకోవడంతో పాటు శ్రమకు తగిన వేతనాన్ని సాధించే దిశగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ వారి హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక ధోరణులకు ఎండగట్టేందుకు సాగుతున్న ఉద్య మాల్లో ప్రతీ కార్మికుడు భాగస్వాములు కోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ, ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, ఆశ వర్కర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మమ్మ, సునీతమ్మ, నాయకులు కాంతమ్మ, లక్ష్మి, మాధవి, అనసూయ, సుజాత, రాజేశ్వరి, నాగబాల, చెన్న మ్మ, మమత, నాగప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

▸ అయిజలో ఘనంగా శోభాయాత్ర

అయిజ/ వడ్డేపల్లి, ఆగస్టు 27 : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని అయిజ మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో మంగళవారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని భగీరథ దేవాలయం నుంచి యాత్రను ప్రారంభించారు. ఊరేగింపులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నర్సింహ, శివ, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జములమ్మ, అనంతమ్మ, సుభద్రమ్మ, దీపిక, నరసమ్మ పాల్గొన్నారు.

- వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడులో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం ముందు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



అయిజ పట్టణంలో కొనసాగుతున్న శోభాయాత్ర, పైపాడులో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఉత్సాహంగా భజన పోటీలు

▸ ధర్మవరం భజన బృందానికి ప్రథమ బహుమతి

ఎర్రవల్లి, అగస్టు 27 : కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఎర్రవల్లి మండల పరిదిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భజన పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ పోటీల్లో 12 భజన బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ బహుమతిని ధర్మవరం గ్రామానికి చెందిన భజనబృందం కైవసం చేసుకోగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ రూ. 20వేలు బహూకరించారు. అయిజ మండలం పర్దిపురం గ్రామానికి చెందిన భజన బృందం రెండవ స్థానంలో నిలవగా, మూల సోమన్న రూ. 15 వేలను అందించినట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గద్వాల టౌన్, ఆగస్టు 27 : కోల్‌కతా అత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం గద్వాల పాత బస్టాండ్ సర్కిల్ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పేరు నరసింహ మాట్లాడుతూ దుర్ఘటన జరిగి పది రోజులు దాటినా బాధిత కుటుంబానికి కనీస న్యాయం దక్కకపోవడం దౌర్భాగ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, రంగన్న, నరేష్, విష్ణు, రామాంజనేయులు, వెంకటేష్, వీరేశ్, బాషా, నరసింహ పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

ధరూరు, ఆగస్టు 27 : ప్రైవేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు అయూబ్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం తహసీల్దార్ వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సభ్యులు రాఘవేంద్ర, జయన్న, వహీద్, మురళి, నరసింహులు, ప్రసాద్, మాలిక్, సంపత్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

గద్వాల టౌన్, ఆగస్టు 27 : పెన్షనర్లు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌బాబు డిమాండ్ చేశారు. గద్వాల పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను మంజూరు చేయాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మల్దకల్, ఆగస్టు 27 : పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు. అధిక వర్షాలతో వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, పత్తి పైర్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రామగోపాల్ వర్మ రైతులకు వివరించారు. సమావేశంలో ఏవో రాజ శేఖర్, ఏఈవోలు, ఏఏఈవోలు పాల్గొన్నారు.

'ఐద్వా జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

గద్వాల టౌన్, ఆగస్టు 27 : జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 29, 30వ తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద కోరారు. పట్టణంలోని వాల్మీకి భవన్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రత్నమ్మ, పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, ఆగస్టు 27 : పట్టణంలోని బీరెల్లి చౌరస్తాలోని 33 కేవీ జమ్మిచేడు లైన్ మార్చాల్సి ఉన్నందున ఈ నెల 28వ తేదీ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వేణుకాలనీ, రెండవ రైల్వేగేటు ఏరియా, బీరెల్లి చౌరస్తా, నందీశ్వర ఆలయం ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రేపు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

అలంపూర్, ఆగస్టు 27 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మురుగు నీరు నిల్వకుండా చూడాలి

రాజోలి, ఆగస్టు 27 : ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వకుండా చూడాలని కొత్త రాజోలిలోని ఆర్డీటీ కాలనీ వాసులు మంగళవారం కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని పలు కాలనీల్లో నీరు నిలిచి దోమల బెడద తీవ్రమైందని తెలిపారు. దీంతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవరాజు, సభ్యులు శీలన్న, సులేమాన్ పాల్గొన్నారు.